క్లుప్తంగా

శ్రీరంగనాథుడికి పల్లకీసేవ



పల్లకీసేవ నిర్వహిస్తున్న దృశ్యం

మద్దికెర : మండలంలోని పెరవలి గ్రామంలో వెలసిన శ్రీరంగనాథుడు, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లకు కార్తీకమాసం శనివారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు. ఉదయం బిందెసేవ, కుంకుమార్చన, అభిషేకం చేపట్టారు. అనంతరం స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను పల్లకీలో కొలువుంచి వేదమంత్రాలతో ఆలయ ప్రదక్షిణ చేయించారు.

దేవాలయ అభివృద్ధికి విరాళాలు

పెరవలిలోని శ్రీరంగనాథ స్వామి దేవాలయంలో తూర్పు రాజగోపుర నిర్మాణానికి అవసరమైన స్థలం కొనుగోలు చేయడానికి దాతలు విరాళాలు అందజేసినట్లు కార్యనిర్వహణాధికారి వీరయ్య శనివారం తెలిపారు. బెల్డోన కుంకా రామాంజనేయులు, వెంకటలక్ష్మి రూ.20 వేలు, మేకల రంగయ్య కుమారుడు రామకృష్ణ రూ.10 వేలు అందజేశారని చెప్పారు.

మల్లన్న చెంతకు శివ మాలధారులు



ఇరుముడితో శ్రీశైలం బయలుదేరిన శివ మాలధారులు

మద్దికెర : మండల కేంద్రానికి చెందిన పలువురు శివ మాలధారులు ఇరుముడులతో శనివారం మల్లన్న చెంతకు బయలుదేరి వెళ్లారు. ముందుగా స్థానిక శివాలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాలధారులు రామాంజులు, శ్రీనివాసులు, పక్కీరప్ప తదితరులు ఇరుముడితో శ్రీశైలం బయలుదేరి వెళ్లారు.

ప్రభుత్వ సేవలపై విద్యార్థులకు అవగాహన



రైల్వే స్టేషన్ వద్ద విద్యార్థులతో ఉపాధ్యాయులు

వెల్దుర్తి(కృష్ణగిరి): విద్యార్థులు ప్రభుత్వ సేవలపై అవగాహన కలిగి ఉండాలనే ఉద్దేశంతో ప్రభుత్వ కార్యాలయాలను సందర్శించినట్లు హెచ్‌ఎం నాగేశ్వరరెడ్డి తెలిపారు. వెల్దుర్తిలోని హరిజనవాడ పాఠశాలలో చదివే 5వ తరగతి విద్యార్థులతో శనివారం ఆయన అన్ని ప్రభుత్వ కార్యాలయాలను సందర్శించారు. ఏ కార్యాలయంలో ఏఏ సేవలు అందుతాయనే వివరాలను విద్యార్థులకు వివరించారు. తహసీల్దార్, ఎంపీడీఓ, గ్రామ పంచాయతీ కార్యాలయం, సచివాలయం, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, రైల్వే స్టేషన్, పశువైద్యశాల, ఎమ్మార్సీ, పోలీస్‌స్టేషన్, రైతు భరోసా కేంద్రం, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంతో పాటు నర్సరీలను విద్యార్థులు సందర్శించారు.

కోలుకోలేక యువకుడి మృతి

ఆలూరు రూరల్: మండలంలోని హత్తిబెళగల్ గ్రామానికి చెందిన సద్దాం హుసేన్ (35) ఐదు రోజుల క్రితం స్కూటర్ అదుపుతప్పి గాయపడి కర్నూలు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక శనివారం మృతిచెందాడు. వివరాలు.. గ్రామంలోని అమినాబీ, హుసేన్ వలి దంపతుల మూడువ కుమారుడు సద్దాం హుసేన్ (35) మంగళవారం రాత్రి గ్రామ సమీపంలోని ఈద్గా వద్ద స్కూటర్ అదుపుతప్పి కింద పడ్డాడు. బంధువులు చికిత్స నిమిత్తం బళ్లారి ఆసుపత్రిలో చేర్పించారు. మెరుగైన చికిత్స కోసం రెండు రోజుల క్రితం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. శనివారం కోలుకోలేక మృతి చెందాడు.

తప్పిన ప్రమాదం



గుంతలోకి దూసుకెళ్లిన కారు

ఆలూరు రూరల్: మండలంలోని హులేబీడు గ్రామ సమీపంలో శనివారం సాయంత్రం జరిగిన ప్రమాదంలో కారు అదుపుతప్పి గుంతలో దూసుకెళ్లింది. ఎమ్మిగనూరు పట్టణానికి చెందిన ఇద్దరు వ్యక్తులు పని నిమిత్తం ఆలూరుకు వస్తుండగా హులేబీడు గ్రామం వద్ద కారు అదుపుతప్పి గుంతలో దూసుకెళ్లింది. కారులో ప్రయాణిస్తున్న వారు సురక్షితంగా బయటపడినట్లు గ్రామస్తులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

తుగ్గలి : రోడ్డు ప్రమాదంలో శనివారం ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. పత్తికొండ నుంచి వస్తున్న బైక్.. రాతనలో ఎదురుగా వచ్చిన ఆర్టీసీ బస్సు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో బైక్‌పై వెళుతున్న పీ.కొత్తూరుకు చెందిన వంశీకి తీవ్రగాయమైంది. స్థానికులు క్షతగాత్రున్ని పత్తికొండకు తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కుటుంబ సభ్యులు కర్నూలుకు తీసుకెళ్లారు.

‘పల్లె పండుగ’ లక్ష్యం నెరవేరేనా!

- నెలాఖరులోగా సీసీ రోడ్ల నిర్మాణం పూర్తి చేయాలని అధికారుల ఆదేశం
- అక్టోబర్ 14న ప్రారంభమైన అభివృద్ధి పనులు
- ఇప్పటిదాకా 30 శాతం పనులు మాత్రమే పూర్తి
- ఆలూరు,పత్తికొండ నియోజకవర్గాల్లో రూ.23.62 కోట్లతో 359 పనులు

గ్రామాల్లో సీసీ రోడ్లు, అవసరమైన చోట డ్రైనేజీల నిర్మాణాలకు కూటమి ప్రభుత్వం పల్లె పండుగ పేరుతో నిధులు కేటాయించింది. సంక్రాంతి నాటికి పూర్తి చేయాలనే లక్ష్యంతో అక్టోబర్ 14న పనులకు ఒకే సారి భూమి పూజ చేశారు. అయితే పనులు డిసెంబర్ చివరి నాటికే పూర్తి చేయాలని ఉన్నతాధికారులు నిర్దేశించి పంచాయతీలకు ఆదేశాలు జారీ చేశారు. పనులు చేపట్టి 50 రోజులు గడిచినా నేటికీ 30 శాతం మాత్రమే పూర్తయ్యాయి. నాలుగు వారాల్లో 70 శాతం పనులు చేపట్టగలరేమో చూడాలి.



ఆలూరు మండలం తుంబళబీడులో సీసీ రోడ్డు నిర్మిస్తున్న దృశ్యం

ఆలూరు రూరల్: గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు, డ్రైన్లు వంటి మౌలిక సదుపాయాల కల్పించేందుకు ప్రభుత్వం ఉపాధి హామీ పథకం కాంపోనెంట్ నిధులు కేటాయించింది. అక్టోబర్ 4న పల్లెపండుగ పేరుతో పనులకు శ్రీకారం చుట్టారు. డిసెంబర్ ఆఖరు నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించారు. అయితే పనులు ప్రారంభమై నెలన్నర గడిచినా 30 శాతం కూడా పూర్తి కాలేదు. ప్రస్తుతం సాగుతున్న తీరును చూస్తే లక్ష్యం పూర్తయ్యేలా కనిపించడం లేదు. ఆలూరు నియోజకవర్గంలో రూ.11.81 కోట్లతో 184 పనులు, పత్తికొండ నియోజకవర్గంలో రూ.9.81 కోట్లతో 175 పనులు గుర్తించారు.

అక్టోబర్ 4న ప్రారంభమైన పనులు..

పల్లె పండుగ కార్యక్రమం ద్వారా గ్రామాల్లో సీసీ రోడ్లు నిర్మించేందుకు వారం రోజుల పాటు విధివిధానాలు, పనుల గుర్తింపు ఎలా అనే అంశంపై ఈ ఏడాది ఆగస్టు 23న ఒకే రోజు అన్ని గ్రామ పంచాయతీల పరిధిలో గ్రామ సభలు నిర్వహించి గుర్తించిన పనులను ఉన్నతాధికారుల ఆమోదం కోసం పంపించారు. ఈ ఏడాది అక్టోబర్ 14 నుంచి నిర్మాణ పనులు ప్రారంభించారు. ప్రజా ప్రతినిధులు ద్వారా పనుల శంకుస్థాపనలకే రెండు వారాలు పట్టింది. నవంబర్ నెల నుంచి పనులు చేపట్టినా యాభై శాతం పనులు కూడా పూర్తి కాలేదు.

కూటమి నేతలు సూచించిన వారికే పనులు..

పల్లె పండుగ కార్యక్రమం పేరుతో అభివృద్ధి పనులు రూ.5 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు ఉన్నాయి. ఆ పనులను ఎక్కడికక్కడ అధికార పార్టీ ప్రజాప్రతినిధులు సూచించిన కూటమి నేతలకే పనులు కట్టబెట్టారు. చాలా గ్రామాల్లో సర్పంచులకు ఈ పనులు కేటాయించలేదు. దీంతో వారికి అనుభవం లేకపోవడంతో పనుల్లో జాప్యం జరుగుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

రూ.23.62 కోట్లతో 359 పనులు..

ఆలూరు,పత్తికొండ నియోజకవర్గాల్లోని 11 మండలాల్లో గ్రామీణ ఉపాధి హామీ పథకం కాంపోనెంట్ నిధులు రూ.23.62 కోట్లతో 359 పనులు గుర్తించారు. ఇందులో సీసీ రోడ్లు, అవసరమైన చోట మాత్రమే డ్రైన్లు నిర్మిస్తున్నారు. కొన్ని చోట్ల ఆయా గ్రామాల టీడీపీ నేతలు చెప్పిన ప్రాంతాల్లో సీసీ రోడ్లు నిర్మిస్తున్నారు. ఇందులో 80 శాతం సీసీ రోడ్లు నిర్మాణానికే నిధులు కేటాయించారు. క్షేత్ర స్థాయిలో జరుగుతున్న పనులను పంచాయతీ రాజ్ అధికారులు పర్యవేక్షిస్తున్నారు. ఇక పనులు పూర్తయిన రోడ్లను కచ్చింతంగా 21 రోజుల పాటు క్యూరింగ్ చేయాలని అధికారులు ఆదేశిస్తున్నారు. అయితే ప్రస్తుతం జరుగుతున్న పనుల్లో అన్ని రోజుల పాటు క్యూరింగ్ చేయడం లేదనే విమర్శలున్నాయి.

ఆలూరు నియోజకవర్గంలో చేపట్టిన పనులు, కేటాయించిన నిధులు..

మండలం	మంజూరైన నిధులు	గుర్తించిన పనులు
ఆలూరు	రూ.2 కోట్లు	31
ఆస్పరి	రూ.2 కోట్లు	41
చిప్పగిరి	రూ.1.81 కోట్లు	19
హాలహర్వి	రూ.2 కోట్లు	33
హొళగుంద	రూ.2 కోట్లు	30
దేవనకొండ	రూ.2 కోట్లు	30
పత్తికొండ నియోజకవర్గంలో..		
పత్తికొండ	రూ.2 కోట్లు	37
తుగ్గలి	రూ.1.84 కోట్లు	29
మద్దికెర	రూ.2 కోట్లు	38
వెల్దుర్తి	రూ.2 కోట్లు	30
కృష్ణగిరి	రూ.2 కోట్లు	41

నెలాఖరులోగా పనులు పూర్తి చేస్తాం



పల్లె పండుగ కార్యక్రమంలో చేపట్టిన సీసీ రోడ్ల పనులు పురోగతిలో ఉన్నాయి. ఇప్పటి వరకు సబ్ డివిజన్‌లో 30 శాతం పనులు పూర్తయ్యాయి. ఈ నెలాఖరులోగా పనులు పూర్తి చేయాలని ఆయా మండలాల ఏఈలకు ఆదేశాలు జారీ చేశాం. సీసీ రోడ్ల పనులు నాణ్యతతో చేపట్టాలని సూచించాం. నాసిరకమైన పనులు చేస్తే బిల్లులు నిలిపివేస్తాం. – మనోహర్,పీఆర్,డీఈఈ, ఆలూరు

విద్యుత్ చార్జీల పెంపు దుర్మార్గం



మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

పత్తికొండ(తుగ్గలి) : కూటమి ప్రభుత్వం ఎన్నికల వాగ్దానానికి భిన్నంగా విద్యుత్ చార్జీలను పెంచి ప్రజలపై పెను భారం మోపడం దుర్మార్గమని మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి ధ్వజమెత్తారు. శనివారం ఆమె సాక్షితో మాట్లాడుతూ.. తాము విద్యుత్ చార్జీలు పెంచబోమని హామీ ఇచ్చి ఎన్నికల్లో ఓట్లు వేయించుకుని అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలపై చంద్రబాబు ప్రభుత్వం రూ.15వేల కోట్లకు పైగా భారం మోపడం సిగ్గుచేటన్నారు. ప్రజలపై రెండోసారి భారీగా విద్యుత్ భారాన్ని మోపిందన్నారు. ఇప్పటికే పలు రకాల పన్నులతో సామాన్య, మధ్య తరగతి ప్రజలు అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వీటితో పాటు అదనంగా కరెంటు చార్జీల పిడుగు అమలయ్యేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవడం సరికాదన్నారు. విద్యుత్ బిల్లులే కాకుండా ట్రూఅప్ చార్జీలు, సర్దుబాటు చార్జీలు వంటి రకరకాల పేర్లు పెట్టి ఆరు నెలల్లోనే జనాన్ని పీల్చి పిప్పి చేస్తున్నారని మండిపడ్డారు. అసలు చార్జీల కంటే కొసరు చార్జీలు ఎక్కువయ్యాయని విమర్శించారు. రాష్ట్ర ప్రజలకు మేలు చేస్తానని ఎన్నికల్లో హామీలిచ్చిన కూటమి నాయకులు అధికారం చేతికి రాగానే ఎప్పటిలాగే నమ్మిన ప్రజలను మోసం చేయడం మొదలు పెట్టారన్నారు. అధికారంలోకి వస్తే ఒక్కపైసా విద్యుత్ చార్జీలు పెంచబోమని కపట వాగ్దానాలు చేసిన నాయకులు ఇప్పుడు ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. విద్యుత్ చార్జీలు పెంపును విరమించుకోకపోతే ప్రజలతో కలిసి ఉద్యమిస్తామని హెచ్చరించారు.

అవకతవకలకు పాల్పడితే చర్యలు



ఆలూరులో నకిలీ లైసెన్స్ రశీదు జారీపై విచారణ చేస్తున్న డీఎల్‌పీఓ వీరభద్రప్ప

ఆలూరు రూరల్: మేజర్ గ్రామ పంచాయతీలో అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని పత్తికొండ డీఎల్‌పీఓ వీరభద్రప్ప సిబ్బందిని హెచ్చరించారు. కార్యాలయంలో కాంట్రాక్ట్ బేసిక్‌పై విధులు నిర్వహిస్తున్న రాం ప్రసాద్ పాత బస్టాండులోని గ్రామ పంచాయతీ షాపు లైసెన్స్ కోసం ఉరుకుంద అనే వ్యక్తికి రూ.వెయ్యి లకు గతంలో పనిచేసిన అధికారుల సంతకం ఉన్న రశీదు జారీ చేశాడని బాధితుడి ఫిర్యాదు మేరకు.. శనివారం ఆయన విచారణ చేపట్టారు. గత నెల 21న సంత మార్కెట్‌లోని షాపింగ్ కాంప్లెక్స్ వేలాల్లో పాల్గొనేందుకు వచ్చిన ఉరుకుంద కుమారుడికి ప్రస్తుతం బస్టాండులో ఉన్న షాపుకు మూడు సంవత్సరాల లెసెన్స్ ఫీజు రూ.1,510 రాం ప్రసాద్‌కు చెల్లించాడు. ఇందులో రూ.వెయ్యి ల విలువైన రసీదులు గతంలో పనిచేసిన ఈఓలు నాగభూషణం, ప్రకాష్ నాయుడు సంతకంతో ఉన్నవి ఇవ్వడంతో అనుమానం వచ్చి అధికారులకు ఫిర్యాదు చేశాడు. ఇందులో భాగంగానే ఆయన బాధితుడి సమక్షంలో రాం ప్రసాద్‌ను విచారించారు. అవకతవకలపై ఉన్నతాధికారులకు నివేదిక ఇస్తామని, అప్పటి వరకు కార్యాలయంలో పనిచేస్తున్న రాం ప్రసాద్‌కు ఎలాంటి వసూళ్లకు పంపకూడదని, అతని వద్ద ఉన్న రికార్డులు స్వాధీనం చేసుకోవాలని పంచాయతీ ఈఓ ప్రభాకర్‌ను ఆదేశించారు.

కలుషిత నీరు సరఫరా అవుతున్నా పట్టించుకోరా?



అధికారులను నిలదీస్తున్న మహిళలు

ఆలూరు రూరల్: రెండు నెలల నుంచి మంచి నీటి సరఫరా చేసే పైపు పగిలి మురుగునీరు సరఫరా అవుతోందని గ్రామ సర్పంచ్, పంచాయతీ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని పట్టణంలోని 3వ వార్డుకు చెందిన మహిళలు వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ నాగమ్మ,వార్డు మెంబర్ జీరా గౌడ్ ఆధ్వర్యంలో కర్నూలు–బళ్లారి రోడ్డులో శనివారం ఆందోళన చేపట్టారు. తమ సమస్యను పరిష్కరించాలని అటుగా వెళ్తున్న టీడీపీ ఇన్‌చార్జ్ వీరభద్ర గౌడ్‌కు వినతి పత్రం అందించారు. కలుషిత నీరు తాగి రోగాల బారిన పడుతున్నామని సర్పంచ్ అరుణాదేవికి ఎన్నిసార్లు విన్నవించినా పరిష్కరించడం లేదని అధికారులను నిలదీశారు. ప్రతి పనిలో సర్పంచ్ సోదరుడు కిశోర్ జోక్యం చేసుకుని పనులకు అడ్డుపడుతున్నాడని వాపోయారు. దీంతో వీరభద్ర గౌడ్.. డీఎల్‌పీఓ వీరభద్ర, పంచాయతీ కార్యదర్శి ప్రభాకర్‌ను పిలిపించి బాధితులకు సమాధానం చెప్పించారు. రోజుల్లోగా మరమ్మతులు చేయించాలని చెప్పారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ చంద్రశేఖర్‌వర్మ

కృష్ణగిరి: ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉన్నప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందని తహసీల్దార్ చంద్రశేఖర్‌వర్మ, ఎస్‌ఐ జి.ఆశోక్ తెలిపారు. వెల్దుర్తిలోని ఎస్సీ కాలనీలో శనివారం సాయంత్రం నిర్వహించిన పౌర హక్కుల దినోత్సవంలో వారు పాల్గొని మాట్లాడారు. ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిన అతి గొప్ప వరం పౌర హక్కులని, వాటిని కాపాడి, ప్రతి పౌరుడికి న్యాయం చేయాల్సిన బాధ్యత ప్రతి అధికారిపై ఉందన్నారు. ప్రతి మనిషి ఎదుటివారిని గౌరవించాలే తప్పా అంటరానివాడిలా చూడాకూడదని చెప్పారు.

ఎల్లెల్సీకి నీటి సరఫరా నిలిపివేయొద్దు

హొళగుంద: తుంగభద్ర దిగువ కాలువ(ఎల్లెల్సీ)కు డిసెంబర్ 1 నుంచి 15 రోజుల పాటు నీటి సరఫరాను నిలిపి వేయకుండా అలాగే కొనసాగించాలని తుంగభద్ర రైతు సంఘం గౌరవ అధ్యక్షుడు, మాజీ సాగునీటి సంఘం అధ్యక్షుడు సమ్మతగేరి తప్పెట రామిరెడ్డి శనివారం డిమాండ్ చేశారు. హొస్పేట్ వద్ద నిర్మించిన తుంగభద్ర జలాశయంలో నేటి వరకు 93 టీఎంసీల నీరు నిల్వ ఉన్నాయని ఈ నీటితో రబీ పంటను సునాయసంగా పండించవచ్చన్నారు. అయితే టీబీ బోర్డు అధికారులు డ్యాం వద్ద మరమ్మతు పనులు పెట్టుకోవడం, ఆంధ్రా టీబీపీ ఇంజినీయర్లు నేటికీ ఆంధ్ర కోటా నీటి కోసం ఇండెంట్ ఇవ్వకపోవడం వల్ల నేటి నుంచి ఎల్లెల్సీకి నీటి సరఫరాను నిలిపి వేసే యోచనలో ఉన్నట్లు తెలిసిందన్నారు. సరఫరా నిలిచిపోతే కాలువ కింద రబీలో భాగంగా సాగుకోసం రైతులు నారుమళ్లు వేసుకున్నారని, మడులు సిద్ధం చేసుకునే పనులు నలిచిపోతాయని చెప్పారు. ఫలితంగా రబీ సాగు ఆలస్యమవడమే కాకుండ పంట చేతికందే సమయానికి సాగునీటి సమస్య తలెత్తే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేశారు. టీబీ బోర్డు, టీబీపీ అధికారులు పునరాలోచించి నిరంతరంగా నీటిని సరఫరా చేయాలని కోరారు.

నిజాయితీగా పనిచేస్తేనే గుర్తింపు



నాగులాల్ రావు దంపతులను సన్మానిస్తున్న అధికారులు

పత్తికొండ(తుగ్గలి) : నిజాయితీగా పనిచేసిన ప్రభుత్వ ఉద్యోగులను ప్రజలు ఎన్నటికీ మరవరని సర్పంచ్ కొమ్ము దీపిక, మాజీ సర్పంచ్ సోమశేఖర్, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ సువర్ణలత, ఈవో నరసింహులు అన్నారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న నాగులాల్ రావు పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సర్పంచ్, వార్డు సభ్యులు, అధికారులు ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కాంట్రాక్టర్ పాలబాషా, వార్డు సభ్యులు సుంకన్న, లింగన్న, మహమ్మద్ పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణాల పరిశీలన

తుగ్గలి : ఉపాధి హామీ నిధులు రూ.20 లక్షలతో రామలింగాయపల్లి, పగిడిరాయిలో చేపట్టిన సీసీ రోడ్ల నిర్మాణ పనులను క్లస్టర్ ఏపీడీ పక్కీరప్ప శనివారం పరిశీలించారు. నిర్మాణాల్లో నాణ్యత పాటించాలని సూచించారు. అనంతరం ఉపాధి హామీ పథకం పనులను తనిఖీ చేశారు. పని ప్రదేశంలో కూలీల మస్టర్‌ను పరిశీలించారు. బినామీ మస్టర్లు వేసి నిజమైన కూలీలకు అన్యాయం చేసినా, పనుల్లో అక్రమాలకు పాల్పడినా చర్యలు తప్పవని హెచ్చరించారు. సర్పంచ్ గౌరవ సలహాదారు వెంకటపతి, క్లస్టర్ టీఏ వెంకప్ప, ఈసీ ప్రదీప్ పాల్గొన్నారు.

కుందనగుర్తిలో..

చిప్పగిరి: మండలోని కుందనగుర్తి గ్రామంలో రూ.20 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను అలూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ వీరభద్ర గౌడ్ శనివారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు మండలానికి రూ.1.80 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు. వీటితో మండలంలోని 16 గ్రామాల్లో వివిధ అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. సర్పంచ్ కొండా పురుషోత్తం ఉన్నారు.

కొలతల ప్రకారమే వేతనాలు

మద్దికెర : ఉపాధి హామీ పథకంలో ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇచ్చిన కొలతలు ప్రకారమే వేతనాలు మంజూరు చేస్తారని టెక్నికల్ అసిస్టెంట్ సుధాకర్ తెలిపారు. శనివారం మద్దికెర పరిసరాల్లో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించి చేసిన పనులకు సంబంధించి కొలతలు వేశారు. ఆయన మాట్లాడుతూ వ్యవసాయ కూలీలు వలసలు పోకుండా కల్పిస్తున్న ఉపాధి పనులు రైతులకు ఉపయోగపడేలా ఇచ్చిన కొలతలు సకాలంలో పూర్తి చేయాలన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్ రాజశేఖర్ ఉన్నారు.

పరిసరాల శుభ్రతతో వ్యాధులు దూరం

తుగ్గలి : పరిసరాల శుభ్రతతో వ్యాధులు దరిచేరవని మలేరియా జిల్లా అధికారి నూకరాజు అన్నారు. శనివారం తుగ్గలిలో పారిశుద్ధ్యాన్ని తనిఖీ చేశారు. నీటి తొట్లలో నిల్వ ఉన్న నీటిని పరిశీలించారు. ఇంటి లోపల, కుండలు, ఫ్రిజ్‌లు, కూలర్లతో పాటు ఇంటి బయట పూలకుండీలు, కొబ్బరి టెంకలు, ఖాళీ డబ్బాల్లో నీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. డ్రైయిన్లలో ప్లాస్టిక్ వ్యర్థాలు ఎవరూ పడేయవద్దని, చెత్త చెదారాం లేకుండా శుభ్రం చేసుకోవాలని సూచించారు. ఆయన వెంట స్థానిక వైద్య సిబ్బంది ఉన్నారు.

ఎండీయూ ఆపరేటర్ల ద్వారానే రేషన్ పంపిణీ చేయాలి

హొళగుంద: గ్రామాల్లో ఇంటింటికీ రేషన్ పంపిణీని ఎండీయూ ఆపరేటర్ల ద్వారానే చేయాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ షఫీవుల్లా డిమాండ్ చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో లబ్ధిదారుల ఇంటి వద్దకెళ్లి సరుకులు పంపిణీ చేస్తుండగా.. మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో డీలర్లే చౌకదుకాణాల వద్ద రేషన్ పంపిణీ చేస్తున్నారన్నారు. రేషన్ పంపిణీ కోసమే ఎండీయూ ఆపరేటర్లను ప్రభుత్వం నియమించిందని, అలాంటప్పుడు పాత పద్ధతిలో డీలర్లు సరుకులు ఎలా వేస్తారని ప్రశ్నించారు. డీలర్ల పంపిణీ కారణంగా వృద్ధులు, దివ్యాంగులు ఇబ్బందులు పడుతున్నారని, అధికారులు ఎండీయూ ఆపరేటర్లతో పంపిణీ చేయించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

గ్రామాల్లో ఉచిత ఎక్స్‌రే పరీక్షలు

దేవనకొండ: మండలంలోని కప్పట్రాళ్ల, కరివేముల గ్రామాల్లో శనివారం టీబీ వ్యాధి నివారణలో భాగంగా మొబైల్ ఎక్స్‌రే క్యాంపు నిర్వహించారు. ఇందులో 102 మందికి ఉచిత ఎక్స్‌రే పరీక్షలు నిర్వహించినట్లు కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ భాగ్యలక్ష్మి తెలిపారు. క్షయ వ్యాధి ఒక అంటువ్యాధి అని, ఒకరి నుంచి ఒకరికి దగ్గినప్పుడు తుమ్మినప్పుడు నీటి తుంపరుల ద్వారా వస్తుందన్నారు. మొబైల్ వాహనం రేడియో గ్రాఫర్స్ శ్రీనివాసులు, ఎల్లయ్య, జిల్లా టీబీ ప్రోగ్రామ్ మేనేజర్ ఉమాపతి, తెర్నేకల్ పీహెచ్‌సీ హెల్త్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ రంగస్వామి, టీబీ సూపర్‌వైజర్ వీరన్న పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

ఆలూరు రూరల్: సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ దిలీప్ కుమార్ సూచించారు. శనివారం సాయంత్రం మండలంలోని అరికెర తండా గ్రామంలో ప్రజలకు అవగాహన కల్పించారు. సోషల్ మీడియాలో వచ్చే యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకుని మోసపోవద్దన్నారు. అపరిచిత వ్యక్తులకు ఫోన్ కాల్స్‌కు ఓటీపీలు చెప్పరాదన్నారు. మట్కా,పేకాట, బెల్టు షాపులు నిర్వహించడం వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ద్విచక్ర వాహనాదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని చెప్పారు.

ప్రజల రక్షణకే కార్డన్ సెర్చ్

తుగ్గలి : ప్రజల రక్షణకే కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్నామని, అనుమానం ఉన్న ప్రాంతాల్లో తనిఖీలు కొనసాగిస్తామని పత్తికొండ డీఎస్పీ వెంకటరామయ్య అన్నారు. శనివారం వేకువజామున అత్యంత సమస్యాత్మకమైన శభాష్‌పురం గ్రామంలో పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. పత్తికొండ అర్బన్, రూరల్, ఆస్పరి, ఆలూరు, దేవనకొండ, వెల్దుర్తి సీఐలు జయన్న, పులిశేఖర్, మస్తాన్ వలి, వెంకటచలపతి, విశ్వనాథ్, 11 మంది ఎస్‌ఐలు, 40 మంది పోలీసులు బృందాలుగా విడిపోయి గ్రామంలో అనుమానితుల ఇళ్లు, వామిదొడ్లు, ఇంటి పరిసరాల్లో విస్తృతంగా సోదాలు చేశారు. సారా బట్టీలపై దాడులు చేసి 250 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. సరైన ధ్రువపత్రాలు లేని బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. వారు మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాలు, సైబర్‌నేరగాళ్ల పట్ల జాగ్రత్తగా ఉండాలని గ్రామస్తులకు సూచించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.



శభాష్‌పురం శివారులో నాటుసారా ఊటను ధ్వంసం చేస్తున్న పోలీసులు

నాటుసారా స్వాధీనం

ఆలూరు రూరల్: నాటుసారా విక్రయించేందుకు ఆలూరుకు వస్తున్న ఓ వ్యక్తిని అరెస్టు చేసి అతని నుంచి 12 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ దిలీప్ కుమార్ శనివారం తెలిపారు. హొళగుంద మండలం నెరణికి తండాకు చెందిన కృష్ణా నాయక్ నాటుసారాను విక్రయించేందుకు స్కూటర్‌పై వస్తుండగా శనివారం ఆలూరు సమీపంలో పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. అతని వద్ద నుంచి 12 లీటర్ల నాటుసారా, స్కూటర్ సీజ్ చేశామని చెప్పారు. కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి రిమాండ్‌కు ఆదేశించినట్లు వెల్లడించారు.

ఎయిడ్స్‌ను నిర్మూలిద్దాం



పత్తికొండలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

పత్తికొండ(తుగ్గలి) : ఎయిడ్స్ రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మాధురి అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని మూడు రోజులుగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులకు వివిధ రకాలపోటీలు నిర్వహించారు. శనివారం రంగోలి పోటీలు నిర్వహించిన అనంతరం అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ప్రజల్లో అవగాహన కల్పించడంతోనే ఎయిడ్స్ వ్యాధి నిర్మూలన సాధ్యమన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పవన్ కుమార్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ మునగాల రామకృష్ణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

నేడు ఎయిడ్స్ దినోత్సవం

దేవనకొండ: స్థానిక పీహెచ్‌సీ పరిధిలో ఆదివారం ఎయిడ్స్ దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వైద్యాధికారి ఎం.వెంకటేశ్వర్లు తెలిపారు. శనివారం ప్రభుత్వ ఆస్పత్రిలో గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఏటా డిసెంబర్ 1న ఎయిడ్స్ దినోత్సవాన్ని ప్రభుత్వం నిర్వహిస్తుందన్నారు. ప్రతిఒక్కరికీ హెచ్‌ఐవీ పట్ల అవగాహన కల్పిస్తామన్నారు. ఆరోగ్య కార్యకర్తలు జయలక్ష్మి, సూపర్‌వైజర్ హనుమంతమ్మ, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.



బుగ్గసంగమేశ్వరంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు,



కోనేరు వద్ద భక్తులు వెలిగించిన దీపాలు

పరమేశ్వరుడికి కార్తీక పూజలు

మద్దికెర : మద్దికెర, బుగ్గసంగమేశ్వరంలోని శివాలయాల్లో కార్తీక మాసం శనివారం సందర్భంగా పరమేశ్వరుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున, సాయంత్ర వేళల్లో మహిళలు కార్తీక దీపాలు వెలిగించి పూజలు చేపట్టారు. ఆలయాలలో పార్వతి, గంగాదేవి, పరమేశ్వరులకు అర్చకులు నిత్య పూజలతో పాటు విశేష పూజలు జరిపించారు.

హొళగుంద: స్థానిక బాలాంజనేయస్వామి ఆలయంలో కార్తీక మాసం శనివారం సందర్భంగా ఆలయ సేవా సమితి ఆధ్వర్యంలో భక్తులు దీపోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వివిధ ఆకారాల్లో దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. అంతకు ముందు ఆలయంలో బాలాంజనేయ స్వామి మూలవిరాట్‌కు అర్చనలు, పంచామృతభిషేకం, ఆకు పూజా, మహా మంగళహారతి, నైవేద్య సంతర్పణ తదితర పూజలు చేపట్టారు. రాత్రి ఆలయంతో పాటు ఆవరణలో, కోనేరు వద్ద భక్తులు దీపాలు వెలగించారు. రాత్రి ఆలయంలో అన్నదానంతో పాటు భజనలు జరిగాయి.



హొళగుందలో బాలాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు చేసిన దృశ్యం